

మల్లన్న సేవలో అజయ్‌జైన్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు.



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం శాస్త్రోక్తంగా పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం మేళ తాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625.97
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:79.699
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:409
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:7,030

పేదల ఉన్నత విద్యకు భరోసా

- నేడు జగనన్న విద్యా దీవెన మూడో విడత విడుదల
- 34,879 మంది విద్యార్థులకు ప్రయోజనం
- 31,494 మంది తల్లుల ఖాతాల్లోకి జమ కానున్న రూ.25.03 కోట్లు
- నగరి నుంచి డీబీటీ ద్వారా విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్

పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తోంది. ఫీజులు చెల్లించలేక ఆయా వర్గాలకు చెందిన విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆగిపోకూడదనే దృఢ సంకల్పంతో కళాశాల ఫీజులను జగనన్న విద్యా దీవెన పథకం కింద, అలాగే ఆహారం, వసతి ఖర్చులను జగనన్న వసతి పథకం కింద ఏటా చెల్లిస్తోంది. ఈ రెండు పథకాలకు క్రమం తప్పకుండా నిధులను విడుదల చేస్తోండటంతో ఎస్సీ, ఎస్టీ బీసీ, ఈబీసీ, మైనారిటీ తదితర వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు పూర్తి చేసి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకుంటున్నారు.

నంద్యాల: పేదరికంతో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. విశ్వ విద్యాలయాల్లో నిర్ణయించిన ఫీజు మొత్తాన్ని విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్ తదితర కోర్సులు అభ్యసించే విద్యార్థులు మొదలుకొని పీజీ, పీహెచ్‌డీ వరకు చదివే వారికి ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి మూడో విడత నిధులను సోమవారం విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్ ఇతర ఉన్నత చదువులు అభ్యసిస్తున్న 34,879 మంది విద్యార్థుల కళాశాల ఫీజుల చెల్లింపుల కోసం రూ.24.52 కోట్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేయనున్నారు. ఏటా నాలుగు విడతలుగా ఫీజు మొత్తాన్ని చెల్లిస్తుండగా మొదటి విడతగా ఈ ఏడాది మార్చి 19న జిల్లాలోని ఆయా సామాజిక వర్గాలకు చెందిన 38,352 మంది విద్యార్థులకు సంబంధించి 32,542 మంది తల్లుల ఖాతాలో రూ.24.93 కోట్లను (ఫీజును) ప్రభుత్వం జమ చేసింది. అలాగే రెండో విడతగా మే 24న జిల్లాలోని 28,486 మంది విద్యార్థులకు సంబంధించి 25,576 మంది తల్లుల ఖాతాలో రూ.23.91 కోట్లను జమ చేసింది. మూడో విడతగా జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, ముస్లిం మైనారిటీ, కాపు, క్రిస్టియన్ మైనారిటీ వర్గాలకు చెందిన 34,879 మంది విద్యార్థులకు చెందిన 31,494 మంది తల్లుల ఖాతాల్లోకి రూ.25,03,01,435 జమ కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చేయూతపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



నగరి నుంచి డీబీటీ ద్వారా నగదు బదిలీ

చిత్తూరు జిల్లాలోని నియోజకవర్గకేంద్రమైన నగరిలో (నేడు) ఈ నెల 28న జరగనున్న బహిరంగసభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విద్యా దీవెన కార్యక్రమం ద్వారా నగదును బదిలీ చేయనున్నారు. అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి డీబీటీ సిస్టమ్ ద్వారా నగదు జమ కానుంది. ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఆయా సంక్షేమ శాఖలకు చెందిన అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా జగనన్న విద్యా దీవెన లబ్ధిదారులు

నియోజకవర్గం	విద్యార్థుల సంఖ్య	తల్లుల సంఖ్య	మొత్తం నగదు
ఆళ్లగడ్డ	5,981	5,435	4,16,84,209
బనగానపల్లె	6,238	5,585	4,36,77,464
డోన్	5,002	4,557	3,39,77,622
నందికొట్కూరు	5,316	4,795	3,54,35,236
నంద్యాల	5,896	5,306	4,60,54,017
పాణ్యం	1,803	1,642	1,29,92,676
శ్రీశైలం	4,643	4,174	3,14,10,833
మొత్తం	34,879	31,494	24,52,32,057

నిధుల మంజూరు ఇలా..

సంక్షేమ శాఖ	విద్యార్థుల సంఖ్య	నిధుల మంజూరు (రూ..ల్లో)
బీసీ	13,762	9,33,36,252
ఈబీసీ	3,469	3,09,98,147
కాపు	2,648	1,93,07,154
ముస్లిం	5,524	3,50,89,726
ఎస్సీ	8,235	5,78,82,656
ఎస్టీ	1,149	77,95,413
క్రిస్టియన్	92	08,22,709
మొత్తం	34,879	24,52,32,057

సీఎంకు రుణపడి ఉంటాం



పట్టణంలోని డిగ్రీ కళాశాలలో నేను బీకాం రెండవ సంవత్సరం చదువుతున్నాను. జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా మా ఫీజులను రీయింబర్స్‌మెంట్ చేయడం సంతోషంగా ఉంది. ఈ పథకం కింద విద్యార్థులకు చదువుల దీవెనలు అందుతున్నాయి. పేదల చదువులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. విద్యార్థులకు ఈ విధమైన సహకారం భవిష్యత్తుకు సైతం భరోసాను ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– పి.అశోక్, డిగ్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి, నంద్యాల

విద్యా దీవెనతో ధైర్యం



నేను పట్టణంలోని డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్నాను. కాలేజీ ఫీజు ప్రభుత్వమే జగనన్న విద్యాదీవెన కింద చెల్లిస్తోంది. విద్యాదీవెన పథకం ద్వారా ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చేస్తున్నారు. ఈ పథకం వలన మాలాంటి పేద విద్యార్థుల్లో ప్రభుత్వం మానసిక ధైర్యాన్ని నింపింది.

– వై.ఐశ్వర్య, డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థి, నంద్యాల

ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలి



విద్యార్థుల చదువుల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న వసతి దీవెన, విద్యాదీవెన, అమ్మ ఒడి వంటి మంచి పథకాలను ప్రవేశపెట్టారు. ఈ విద్యాసంవత్సరానికి విద్యార్థులకు సంబంధించి కాలేజీ ఫీజును మూడో విడత విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.24.52 కోట్లు జమ చేయనుంది. సీఎం సోమవారం నగరి నుంచి బటన్ నొక్కి తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ డబ్బులను విద్యార్థుల తల్లులు కాలేజీల్లో ఫీజులు చెల్లించాలి. విద్యార్థులు బాధ్యతాయుతంగా చదువుకొని ప్రయోజకులు ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలి.

– చింతామణి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ, నంద్యాల

న్యూస్‌రీల్

శ్రీశైలంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



భక్తులతో కిక్కిరిసిన క్యూలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. సెలవు రోజు కావడంతో ఉభయతెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తదితర రాష్ట్రాల నుంచి భక్తులు శ్రీశైలం చేరుకున్నారు. భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను దర్శనార్థం వచ్చిన భక్తులతో క్షేత్రంలోని పురవీధులు, ఆలయ క్యూలైన్లు కిటకిటలాడాయి. పాతాళగంగ పుణ్య స్నానాలనంతరం భక్తులు మల్లన్న దర్శనార్థమై ఉచిత, ప్రత్యేక దర్శన క్యూలకు చేరుకోవడంతో అన్ని క్యూ కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండిపోయాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయాధికారులు క్యూలలో వేచి ఉన్న భక్తులకు మంచినీరు, అల్పాహారాన్ని ఉచితంగా అందజేశారు.

నేడు 'జగనన్నకు చెబుదాం - స్పందన'

నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో సోమవారం వినూత్న తరహాలో 'జగనన్నకు చెబుదాం–స్పందన' కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఉదయం 9.30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా ఏకాదశి ఉత్సవం



ఉత్సవమూర్తులకు తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున మూలమూర్తులను సుప్రభాతసేవతో మేలుకొలిపి దివ్య దర్శన నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను ఆలయ ముఖద్వార మండపంలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించి వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల మధ్య ధూపదీపాలతో మహా మంగళ హారతి అందించారు. రాత్రి విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు పల్లకీలో కొలువుదీరి తిరువీధిలో విహరించారు.

శ్రీశైలం తరహాలో మహానంది అభివృద్ధి

- ఎథిక్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- భక్తులకు మహానందీశ్వరుడి నిజరూప దర్శనం ప్రారంభం

మహానంది: శ్రీశైల క్షేత్రం తరహాలో మహానంది క్షేత్రం అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించామని ఎథిక్స్ కమిటీ ఛైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. మహానందీశ్వరస్వామి నిజ రూప దర్శనం ప్రారంభించేందుకు సతీసమేతంగా ఆదివారం మహానంది వచ్చారు. ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డిలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా వారు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ భక్తులందరికీ స్వామివారి దర్శన భాగ్యం కల్పించాలన్న ఉద్దేశంతో నిజరూపదర్శనం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుని అమలు చేశామన్నారు. కేవలం రూ.500తో దంపతులు ఇద్దరూ స్వామివారిని నిజరూపంలో క్షీరాభిషేకం చేసుకునేలా టికెట్ ధర తక్కువగా నిర్ణయించామన్నారు. అలాగే లడ్డూ, పులిహోరతో పాటు 27 ఏళ్ల తర్వాత వడప్రసాదం అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. మహానంది క్షేత్రంలో ఇప్పటికే రూ.4.60కోట్ల టీటీడీ నిధులతో వసతి గృహాల నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. మరో రూ.పది కోట్లతో 55 వసతి గృహాలు త్వరలోనే మొదలు పెడతామన్నారు. దాతల సహకారంతో సూట్‌రూము రూ. 20లక్షలు, ఏసీ గది రూ. 15 లక్షలు చొప్పున నిర్ణయించి నిర్మించేందుకు సన్నాహాలు ప్రారంభించామన్నారు. రూ. 80 లక్షలతో మూడు కోనేరుల మరమ్మతులు జరుగుతున్నాయన్నారు. ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్ల వెంట ఉన్న ఇనుప గ్రిల్స్ అన్ని తొలగించి వాటి స్థానంలో రూ. 20 లక్షలతో స్టెయిన్‌లెస్ స్టీల్‌తో అధునాతనమైన గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తొమ్మిది గోవులను బృందావనం గోశాలలో ఉంచి గోపూజ చేసుకునేలా అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాల్లో ఎంపీపీ యశస్విని, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, నాయకులు నాగభూపాల్‌రెడ్డి, నాయకులు వీరారెడ్డి, సర్పంచ్ శిరీష, ఎంటీపీసీ బంగి వెంకటేశ్వర్లు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు బసిరెడ్డిగారి రామ తులశమ్మ, గజ్జా సంపూర్ణ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



వడ ప్రసాదాన్ని ఎమ్మెల్యే శిల్పాకు అందిస్తున్న ఆలయ ఛైర్మన్ మహేశ్వరరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి

కొత్త రైస్ కార్డులొచ్చాయ్!

- జిల్లాకు 5,843 నూతన బియ్యం కార్డులు మంజూరు
- నంద్యాలకు అత్యధికంగా 829
- సచివాలయాల్లో కార్డుదారులకు అందజేత
- ఈనెల నుంచే నిత్యావసర సరుకుల పంపిణీ



కొత రైస్ కార్డులు

నంద్యాల(అర్బన్): పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం బియ్యం కార్డుల మంజూరు ప్రక్రియ సులభతరం చేసింది. అర్హత ఆధారంగా వెంటనే మంజూరు చేస్తోంది. వలంటీర్లే ఇంటింటికి తిరిగి అర్హులను గుర్తించి దరఖాస్తు చేయిస్తున్నారు. అవసరమైన ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారుల నుంచి తీసుకొని వారే సచివాలయాల్లో అందిస్తూ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయిస్తున్నారు. గత నెలలో జిల్లా వ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించగా, రేషన్ కార్డుల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. అర్హులను గుర్తించిన అధికారులు 5,823 కుటుంబాలకు కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేశారు. కొత్త బియ్యం కార్డులను ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా పంపిణీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. అందులో భాగంగా వలంటీర్లను లబ్ధిదారుల ఇళ్లకు పంపి కార్డు అందించడం, లేదా సచివాలయాలకు పిలిపించి ఇవ్వాలని నిర్ణయించారు. లబ్ధిదారు సచివాలయానికి వెళ్లగానే కార్డు ప్రింట్ తీసి వెంటనే అందజేస్తారు.

మంజూరు ప్రక్రియ నిరంతరం

రేషన్ కార్డులు మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగాలే ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో కొత్తగా పెళ్లయిన దంపతులు, ఉమ్మడి కుటుంబాల నుంచి విడిపోయి వేరు కాపురం పెట్టిన వారు దరఖాస్తు చేయగానే కొత్త రేషన్ కార్డు మంజూరు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని 29 మండలాల పరిధిలో 5,36,978 రేషన్ కార్డులున్నాయి. ఈ కార్డుల ద్వారా ప్రతి నెలా 8,054 మెట్రిక్ టన్నుల బియ్యం ఉచితంగా అందజేస్తున్నారు. తక్కువ ధరకే పంచదార, కందిపప్పు, రాగులు, జొన్నలు, పట్టణ ప్రాంతాల్లో గోధుమపిండి, తదితర సరుకులను ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే చేరుస్తున్నారు.

కొత్త కార్డులకు రేషన్ పంపిణీ..

కొత్త కార్డులకు ఈ నెలలోనే రేషన్ పంపిణీ చేయడానికి అవసరమైన బియ్యం, రాగులు, చక్కెరలను అధికారులు సరఫరా చేశారు. జిల్లాలో 1,204 చౌక దుకాణాలుండగా ఇంటి వద్దనే బియ్యం అందించేందుకు 351 వాహనాలు అందుబాటులో ఉన్నాయి.

మండలాల వారీగా కొత్త కార్డుల మంజూరు ఇలా..

మండలం	కార్డులు	మండలం	కార్డులు
నంద్యాల	829	కొత్తపల్లి	160
బనగానపల్లె	401	అవుకు	156
డోన్	399	పాములపాడు	145
ఆత్మకూరు	357	ఉయ్యాలవాడ	140
బేతంచెర్ల	298	మిడుతూరు	138
ఆళ్లగడ్డ	255	జూపాడుబంగ్లా	130
నందికొట్కూరు	239	రుద్రవరం	124
శిరివెళ్ల	211	మహానంది	119
సంజామల	191	కోవెలకుంట్ల	118
గడివేముల	185	పగిడ్యాల	112
బండిఆత్మకూరు	177	ప్యాపిలి	82
గోస్పాడు	175	దొర్నిపాడు	77
కొలిమిగుండ్ల	174	వెలుగోడు	66
పాణ్యం	173	శ్రీశైలం	31
చాగలమర్రి	161	మొత్తం	5,823

కార్డు వస్తుందని ఊహించ లేదు



రెండు దశాబ్దాల క్రితం ఉపాధి నిమిత్తం మహారాష్ట్ర నుంచి నంద్యాలకు వచ్చి స్థిరపడ్డాం. ఆధార్‌కార్డు, ఓటరుకార్డు, బ్యాంక్ అకౌంట్, కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలు ఉన్నా రేషన్ కార్డు మంజూరు కాక ఇబ్బందులు పడ్డాం. వార్డు వలంటర్ జగదీష్ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా రేషన్ కార్డు మంజూరుకు దరఖాస్తు చేయించాడు. కార్డు వస్తుందని కలలో కూడా ఊహించలేదు. జగనన్న ప్రభుత్వంలో రేషన్ కార్డు రావడంతో ఆరోగ్యశ్రీకి అర్హత సాధించినట్లు అయ్యింది.

– జునేర్ అక్తర్, కార్డుదారుడు, విద్యానగర్, నంద్యాల

కొత్త కార్డులకూ సరుకులిచ్చాం



జిల్లాలో కొత్తగా 5,823 కుటుంబాలకు బియ్యం కార్డులు మంజూరయ్యాయి. వారికి కూడా ఆగస్టు కోటా అందజేసేందుకు అవసరమైన సరుకులు డీలర్లకు సరఫరా చేశాం. నూతన కార్డులకు బియ్యం, రాగులు, సైతం తీసుకెళ్లారు. వారికి కూడా ఫోర్టిఫైడ్ బియ్యాన్నే అందజేస్తారు. ప్రస్తుతం జిల్లాలో 5,36,978 కార్డులకు 8,054 మెట్రిక్ టన్నుల బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. రైస్ కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగుతోంది. అర్హత ఆధారంగా అధికారులు వెంటనే మంజూరు చేస్తారు.

– వెంకటరాముడు, డీఎస్‌ఓ, నంద్యాల

భక్తకోటి మెచ్చేలా..!

- శ్రీమఠంలో వసతి సౌకర్యాలు
- సేవలు అందిస్తున్న 21 నిలయాలు
- విడిది కోసం 1,044 గదులు సిద్ధం
- ఆరాధనోత్సవాల నేపథ్యంలో 100 షవర్లు, 50 మొబైల్ శౌచాలయాల ఏర్పాటు

మంత్రాలయం: ఇల వైకుంఠ ధామంగా శ్రీరాఘవేంద్రస్వామి మఠం వర్ధిల్లుతోంది. ధార్మిక, ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతూనే భక్తకోటి సేవలో తరిస్తోంది. వసతి నిలయాల నిర్మాణాలకు శ్రీమఠం అధికారులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. 352వ ఆరాధనోత్సవాల్లో భాగంగా భక్తుల కోసం రెండు కొత్త వసతి సముదాయాలు నిర్మించారు. ఒక వసతి నిలయాన్ని పునరుద్ధరించారు. మరో కల్యాణమంటపాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఆరాధనోత్సవాల సందర్భంగా శ్రీమఠంలో భక్తులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలపై ప్రత్యేక కథనం..

పెరిగిన వసతి నిలయాలు

2009కి ముందు శ్రీమఠంలో కేవలం ఏడు వసతి గృహాలు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం వాటి సంఖ్య 22కు చేరింది. పాత క్వార్టర్స్, వసతి గృహాల పునరుద్ధరణతోపాటు నూతన నిలయాలను నిర్మాణం చేస్తున్నారు. ప్రస్తుతం 22 వసతి గృహాల్లో 1,044 గదులు ఉన్నాయి. వీటిలో 36 షూట్ రూములు, 168 ఏసీ గదులు, 850 సాధారణ రూములు ఉన్నాయి. సుయతీంద్రతీర్థులు నిలయంలో 188, విజయీంద్ర వసతి గృహంలో 93, ధీరేంద్ర వసతి గృహంలో 89, సుశీలేంద్ర వసతి గృహంలో 87, మూలరామ నిలయంలో 102, నరహరి తీర్థ నిలయంలో 78, బృందావన గార్డెన్‌లో 83 గదులు ఉన్నాయి. ఎస్‌వీవీబీ 16, పద్మనాభతీర్థ భవన్‌లో 20 వీవీఐపీ షూట్ రూములు మాత్రమే ఉన్నాయి. సరసమైన ధరలకే వీటిని శ్రీమఠం అధికారులు భక్తులు ఇస్తున్నారు.



పద్మనాభతీర్థుల షూట్ రూమ్స్ భవనం

సరికొత్త నిలయాలు

352వ ఆరాధనోత్సవాలకు కొత్తగా రెండు సముదాయలు నిర్మించారు. కేంద్ర విచారణ కార్యాలయం (సీఆర్‌వో ఆఫీసు) వెనక భాగంలో 102 గదులతో మూలరామ నిలయం ప్రారంభించారు. మాధవరం రోడ్డులో 78 గదులు నరహరి తీర్థ నిలయం నిర్మించారు. పునర్దురించిన 93 గదుల విజయీంద్ర వసతి గృహంలో భక్తులకు రూములు కేటాయించనున్నారు. ఈ నిలయాల్లో 273 గదులు అందుబాటులోకి తెచ్చారు.


వసతి నిలయాలు	గదుల రకాలు	ఒక్కరోజు ధర
పద్మనాభతీర్థ	20 షూట్‌రూములు	రూ. 2,500
ఎస్.వి.వి భవన్	16 షూట్‌రూములు	రూ. 2,500
ఎనిమిది నిలయాల్లో	168 ఏసీ రూములు	రూ. 1350
వివిధ వసతి గృహాల్లో	767 నాన్ ఏసీ రూములు	రూ. 500
బృందావన గార్డెన్	83 సాధారణ రూములు	రూ. 250
సుయతీంద్ర నిలయం	188 నాన్ ఏసీ రూములు	రూ. 400
సుశీలేంద్ర వసతి గృహం	87 నాన్ ఏసీ రూములు	రూ. 400
ధీరేంద్ర వసతి గృహం	89 నాన్ ఏసీ రూములు	రూ. 400

కల్యాణ మంటపాల కేటాయింపు

శ్రీమఠం పరిధిలో తిరుమల తిరుపతి దేవస్థానం, హెచ్ఆర్‌బీ, పరిమళ, భూ రమణ, దుర్గా రమణ కల్యాణ మంటపాలు ఉన్నాయి. వీటిని సైతం ఆరాధనోత్సవాలకు వచ్చే భక్తులకు కేటాయిస్తున్నారు. భూ రమణలో ప్రత్యేక క్లోక్ రూము ఏర్పాటు చేశారు. హెచ్ఆర్‌బీలో 500 మంది, టీటీడీ కల్యాణ మంటపంలో 250 మంది, భూరమణ, దుర్గారమణలో 300 మంది, పరిమళ కల్యాణ మంటపంలో 100 మంది విడది చేసేందుకు వీలుంటుంది. ఇక సేవా భక్తుల కోసం శ్రీమఠం ఆధీనంలోని పరిమళ విద్యానికేతన్ పాఠశాలను కేటాయించనున్నారు.



సుయతీంద్ర తీర్థుల 188 గదుల వసతి సముదాయం



కాలకృత్యాల కోసం

భక్తులు కాలకృత్యాలు తీర్చేకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కేంద్ర విచారణ కార్యాలయం వెనుక, అన్నపూర్ణ భోజన శాల ముంగిట, పరిపాలన కార్యాలయం కుడివైపు శౌచాలయాలు ఉన్నాయి. నదీ తీరంలో రెండు సులభ్ కాంప్లెక్సులు ఉన్నారు. రద్దీ దృష్ట్యా నది తీరంలో 50 మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయనున్నారు. తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం అడుగంటిపోయింది. ఈ నేపథ్యంలో పుష్కరఘాట్లతో స్నానాలకు ప్రత్యేకంగా 100 షవర్లను ఏర్పాటు చేయనున్నారు.

వసతి విచారణ విభాగాల ఏర్పాటు

రాఘవేంద్ర సర్కిల్‌లోని కేంద్ర విచారణ కార్యాలయం ఉంది. వసతి గదుల కోసం భక్తులు ఇక్కడే విచారణ చేసుకోవాలి. వసతి గృహాల సంఖ్య పెరగడంతో విచారణ కోసం మూడు విభాగాలను ఏర్పాటు చేశారు. కేంద్ర కార్యాలయంతో పాటు, బృందావన్‌గార్డెన్, ఎస్‌వీవీ భవన్‌లలో విచారణ విభాగాలు నెలకొల్పారు. శ్రీమఠం ఈశాన్య భాగంలోని వసతి నిలయాల విచారణ బృందావన గార్డెన్‌లో చేసుకోవాలి. మాధవరం రోడ్డులోని గృహాల వివరాలు ఎస్‌వీవీ భవన్‌లో తెలుసుకోవాల్సి ఉంది. ఇక షూట్ రూములు, మూలరామ నిలయ, సుయతీంద్ర నిలయ, విఠలమందిర్ వివరాలు కేంద్ర కార్యాలయంలోనే గదులు కేటాయిస్తారు. మరిన్ని వివరాలకు కేంద్ర విచారణ కార్యాలయం మొబైల్ నంబర్ 08512 279659 సంప్రదించవచ్చు. అలాగే భక్తుల కోసం www.srsmutha.org వెబ్‌సైట్‌లో వసతి గదులు బుకింగ్ చేసుకునే సదుపాయం అందుబాటులోకి తెచ్చారు.

విరివిగా వసతి భవనాలు



రాఘవేంద్రస్వామి అనుగ్రహంతో భారీగా భక్తులు శ్రీమఠానికి తరలివస్తున్నారు. రోజురోజుకు రద్దీ పెరుగుతూనే ఉంది. భక్తుల సౌకర్యార్థం విరివిగా వసతి భవనాలు నిర్మిస్తున్నాం. ఈ ఏడాది రూ.7 కోట్లతో మూలరామ నిలయం, మరో రూ. 7 కోట్లతో నరహరితీర్థ నిలయాలు కొత్తగా నిర్మించాం. శిథిలావస్థకు చేరిన విజయీంద్ర వసతి గృహాన్ని రూ.1.60 లక్షలతో పునరుద్ధరించాం. ఆరాధనోత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.

– సుబుధేంద్రతీర్థులు, శ్రీమఠం పీఠాధిపతి

క్లుప్తంగా

వ్యక్తి దుర్మరణం

పాణ్యం: మండల పరిధిలోని నూలుమిల్లు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కౌలూరు గ్రామానికి చెందిన మల్లెపూల నరసింహుడు(50) కుమార్తె ఆదివారం పాణ్యం ప్రభుత్వాసుపత్రిలో ప్రసవించింది. బైక్‌పై వచ్చిన తండ్రి కుమార్తెను చూసి ఇంటికి తిరిగి వెళ్తున్నాడు. నూలుమిల్లు వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నరసింహుడును స్థానికులు చికిత్స నిమిఊత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ కొద్దిసేపటికి కోలుకోలేక మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కట్టెలు కొడుతూ మృత్యువాత

ఎమ్మిగనూరురూరల్: కడివెళ్ల గ్రామంలో ఆదివారం ఉదయం కట్టెల కొట్టేందుకు పొలం దగ్గరకు వెళ్లి గుండెపోటుతో పింజరి రహంతుల్లా(53) అనే వ్యక్తి మృతి చెందాడు. ఉదయం పింజరి రహంతుల్లా, మరో ఇద్దరు వ్యక్తులు కలసి కట్టెలు కొట్టేందుకు వెళ్లారు. కట్టెలు కొడుతుండగా దాహం వేయటంతో నీళ్లు తాగి రహంతుల్లా కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న మరో ఇద్దరు వ్యక్తులు వచ్చి లేపిచూడగా స్పృహకోల్పోవడంతో ఆటోలో చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గుండెపోటు రావటం వల్లే రహంతుల్లా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

మద్యం తాగొద్దన్నందుకు..

ఎమ్మిగనూరురూరల్: మద్యం తాగొద్దన్నందుకు ఉరివేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం పట్టణంలోని సోమప్ప నగర్‌లో చోటుచేసుకుంది. పద్మశాలి తిమ్మప్ప(45), భాగ్యలక్ష్మి దంపతులకు కుమారులు అనిల్, అజయ్‌లు ఉన్నారు. జాతర్లలో బొమ్మలు, స్టిక్కర్లు విక్రయిస్తూ తిమ్మప్ప కుటుంబాన్ని పోషించేవాడు. శనివారం రాత్రి మద్యం తాగి ఇంటి రావటంతో భార్య, పిల్లలు తిమ్మప్పతో గొడవపడ్డారు. దీంతో మనస్తాపానికి గురై అర్ధరాత్రి అందరు నిద్రపోయాక తన గుడిసె బొంగుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో నిద్రలేచిన భార్య గుడిసెలో ఉరివేసుకొని భర్త వేలాడుతుంటే కేకలు వేయటంతో పిల్లలు, ఇంటి పక్కల వారు వచ్చి తిమ్మప్పను కిందకు దింపి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. భార్య, పిల్లలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ పోలీసులు తెలిపారు.

అలగనూరు పాపం చంద్రబాబుదే!

- 2017లో కుంగిన రిజర్వాయర్ కట్టలు
- మరమ్మతులు చేయాలని సూచించిన ఇంజనీర్లు
- పట్టించుకోని అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం
- శాశ్వత పనులకు ప్రస్తుతం రూ.26 కోట్లతో అంచనాలు



కుంగిన అలగనూరు రిజర్వాయర్ బండ్



రిజర్వాయర్‌లో బండ్ పనులు చేస్తున్న దృశ్యం

కర్నూలు సిటీ: టీడీపీ హయాంలో అలగనూరు రిజర్వాయర్‌ను నిర్లక్ష్యం చేశారు. దీంతో ఈ జలాశయం నుంచి కేసీ కెనాల్ చివరి ఆయకట్టుకు నీటిని అందించలేని దుస్థితి నెలకొంది. కర్నూలు-కడప కాలువ నీటిని తాత్కాలికంగా నిల్వ చేసేందుకు రిజర్వాయర్లు లేకపోవడంతో 1985లో అలగనూరు జలాశయం నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మిడుతూరు మండలం అలగనూరు గ్రామం సమీపంలో కేసీ కెనాల్ 119 కి.మీ దగ్గర రిజర్వాయర్ నిర్మాణానికి రూ.3.06 కోట్లతో పరిపాలన అనుమతులు కూడా వచ్చాయి. ఈ మేరకు జీఓ ఎంఎస్ నంబరు 327 జారీ అయ్యింది. అయితే 1993 వరకు దీనిని ఎవరూ పట్టించుకోలేదు. జైకా నిధులతో కేసీ కెనాల్‌ను ఆధునికీకరించే పనుల్లో భాగంగా రూ.59.90 కోట్లతో అలగనూరు రిజర్వాయర్‌ను చేపట్టారు. పనులు ఆలస్యమై 2004లో పూర్తయ్యాయి.

ఇదీ సమస్య..

కోర్టు కేసుల కారణంగా రిజర్వాయర్ ఎర్త్ బండ్ చాలా కాలంపాటు ఆగిపోయింది. లోతైన కొండ గట్టు పోర్షన్‌లో నేల స్థాయి కంటే తక్కువ పారల కుదింపు జరుగలేదు. ఈ రిజర్వాయర్ పనులు జరుగుతున్న సమయంలో గడివేముల నుంచి రోళ్లపాడు గ్రామానికి వెళ్లేందుకు ఉన్న రోడ్డును తొలగించకుండా, ఎలాంటి ట్రెంచెస్ వేయకుండానే నిర్మాణం చేపట్టారనే విమర్శలు ఉన్నాయి. నిపుణుల కమిటీ సైతం ఇదే అనుమానాన్ని వ్యక్తం చేసింది. రోడ్డు ఉన్న ప్రాంతం, గతంలో ఇక్కడ ఉండే చెరువులోకి నీరు వచ్చేందుకు ఉండే వాగు మట్టిని తొలగించకపోవడంతోనే బండ్ కుంగిందని తెలుస్తోంది. రిజర్వాయర్ లోపల వైపునకు 2.5 కి.మీ నుంచి 2.65 కి.మీ, 2.75 నుంచి 2.85 కి.మీ, 2.9 కి.మీ నుంచి 3.00 కి.మీ, 3.15 నుంచి 3.25 కి.మీ వరకు, పైభాగంలో 2.65 కి.మీ నుంచి 2.75 కి.మీ వరకు బండ్ కుంగింది. దిగువ భాగంలో కూడా కొన్ని చోట్ల నీరు సీపేజ్ అవుతున్నట్లు ఇంజినీర్లు గుర్తించారు.

నాడు పట్టించుకోని టీడీపీ

2017-18లో రిజర్వాయర్ బండ్ రాతి పరుపు కుంగి పోతున్నా కూడా అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కేవలం ఇసుక సంచులు వేసి వదిలేశారు. ఆ రోజు కుంగిన బండ్‌కు మరమ్మతులు చేసి ఉంటే ఈ రోజు సాగు, తాగు నీటిని ఇబ్బంది లేకుండా రిజర్వాయర్‌లో 2.65 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునేందుకు అవకాశం ఉండేది. నాటి ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఆయకట్టు రైతులు నాలుగేళ్లుగా నీరందక ఇబ్బందులు పడుతున్నారు.

నేడు శాశ్వత పరిష్కారం దిశగా..

ప్రస్తుత ప్రభుత్వం కుంగిన బండ్‌కు మరమ్మతులు చేసేందుకు రూ.3.61 కోట్లతో 2021లో పనులు మొదలు పెట్టింది. భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా చేసేందుకు నిపుణుల కమిటీ క్షుణ్ణంగా పరిశీలించింది. ఆ కమిటీ సూచనల మేరకు శాశ్వతంగా కుంగిన చోట బండ్‌ను పునాది నుంచి పునఃనిర్మాణం చేసేందుకు రూ.26 కోట్లతో కేసీ కెనాల్ ఇంజినీర్లు అంచనాలు వేశారు. ప్రస్తుతం వీటిపై ఉన్నత స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి.

త్వరలోనే బండ్ పునర్నిర్మాణ అనుమతులు

రిజర్వాయర్ బండ్ మొదట్లో 250 మీటర్లు మాత్రమే కుంగింది. ఏటేటా బండ్ కుంగిపోవడం పెరుగుతుండడంతో శాశ్వత మరమ్మతులు చేయనున్నాం. సుమారు 750 మీటర్ల బండ్ పూర్తి స్థాయిలో పునఃనిర్మాణం చేయనున్నాం. అలాగే వదిలేస్తే కొట్టుకపోయే ప్రమాదం ఉంటుంది. నిపుణుల కమిటీ సూచనల మేరకు పనులు చేపట్టనున్నాం. ప్రస్తుతం అలగనూరు రిజర్వాయర్ బండ్‌ను బలోపేతం చేసేందుకు రూ.26 కోట్లతో అంచనాలు వేశాం. ఈ ఫైల్ ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి ఆర్థిక శాఖ దగ్గరకు వెళ్లనుంది. త్వరలోనే అనుమతులు రానున్నాయి.

– రెడ్డి శేఖర్ రెడ్డి, జల వనరుల శాఖ, కర్నూలు సర్కిల్ ఎస్ఈ

సచివాలయ ఉద్యోగులపై కలెక్టర్ సీరియస్

- ఇద్దరు సస్పెన్షన్, ముగ్గురికి షోకాజ్ నోటీసులు
- మున్సిపల్ కమిషనర్‌కు కూడా..

నంద్యాల: నంద్యాల పట్టణంలోని వార్డు సచివాలయాల్లో విధుల పట్ల నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ కొరడా ఝులిపించారు. ఇద్దరు వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలను సస్పెండ్ చేస్తూ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. అలాగే మరో ముగ్గురికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీరితో పాటు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డికి సైతం షోకాజ్ నోటీసు జారీ చేశారు. కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఇటీవల గ్రామ, వార్డు సచివాలయాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో కొందరు సిబ్బంది విధులకు ఆలస్యంగా హాజరు కావడం, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించకపోవడం వంటివి గమనించారు. ఈ మేరకు నంద్యాల పట్టణంలోని లలిత నగర్ సచివాలయ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ టి.బాబావలి, సలీం నగర్ సచివాలయ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ ఎం. సుధాకర్‌రెడ్డిల హాజరు సరిగా లేకపోవడంతో సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. అలాగే జగజ్జనని నగర్ సచివాలయ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ ఎస్. అజమతుల్లా, నూనెపల్లి హరిజనవాడ సచివాలయ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ ఎస్. నారాయణ, వైఎస్సార్ నగర్ సచివాలయ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ కె. జస్వంత్ బాబులకు సంజాయిషీ నిమిత్తం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అలాగే ఆరు నెలల వ్యవధిలో సచివాలయాలను ఒకసారి కూడా తనిఖీ చేయకపోవడం, స్పందన ఫిర్యాదులను పరిష్కరించక పోవడంతో సంజాయిషీ కోరుతూ మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డికి కూడా షోకాజ్ నోటీసు జారీ చేశారు.

30న ఉద్యోగులకు క్రీడా ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియంలో ఈనెల 30వ తేదీన వివిధ క్రీడాంశాల్లో ఉద్యోగులకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య కార్యానిర్వహణ అధికారి రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బెస్ట్‌ఫిజిక్, బాస్కె ట్ బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, ఖో-ఖో, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, రెజ్లింగ్, యోగా వంటి క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో ఎంపికైన ఉద్యోగులు వచ్చే నెల నుంచి 8 వరకు విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడి యంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో శిల్పా వన్ స్పేస్ వెంచర్



బ్రోచర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా తదితరులు



పాల్గొన్న కస్టమర్లు

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాకే తలమానికంగా 150 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో శిల్పా వన్ స్పేస్ వెంచర్‌ను నంద్యాల మండలం పాండురంగాపురం గ్రామంలో ఏర్పాటైనట్లు శ్రీశైలం ఎమ్మెల్యే, శిల్పా గ్రూపు చైర్మన్ శిల్పా చక్రపాణిరెడ్డి, డైరెక్టరు శిల్పా కార్తీక్ రెడ్డి తెలిపారు. ఆదివారం పాండురంగాపురం గ్రామంలోని వెంచర్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఅండ్‌కే శిల్పా గ్రూపు ఆధ్వర్యంలో ఈ వెంచర్‌లో విలాసవంతమైన జీవితాన్ని గడిపేందుకు అన్ని వసతులు సమకూరుస్తున్నట్లు చెప్పారు. శిల్పాగ్రూపు అంటేనే వినియోగదారులకు నమ్మకం అని, ఆ నమ్మకాన్ని ఎక్కడా వమ్ము చేయకుండా వినియోగదారులు పెట్టిన పెట్టుబడికి నాణ్యతతో కూడిన విలాసవంతమైన సౌకర్యాలతో ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. తక్కువ విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకొని విశాలంగా మైదానం ఉంచుకోవచ్చునన్నారు. ఈ సముదాయంలో క్లబ్‌హౌస్, రెస్టారెంట్, స్విమ్మింగ్ పూల్, సూపర్ మార్కెట్, ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియం , మోడరన్ జిమ్, అండర్ గ్రౌండు ఎలక్ట్రిసిటీ, వాటర్ లైన్, డ్రైనేజీ, 24 గంటలు సెక్యూరిటీ, ఓపెన్ ఎయిర్ థియేటర్లు, సెలూన్‌అండ్ స్పా, బ్యాంకెట్ హాల్, పార్టీలాన్స్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి, తొగూరు ఆర్థర్, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, రాష్ట్ర మార్కెఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, శిల్పా భువనేశ్వరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యరబ్రోలు పురుషోత్తంరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రాహర్షవర్ధన్ రెడ్డి, మధుసూదనరెడ్డి, పాండురంగారంపురం గ్రామ సర్పంచ్ డోలా వతమ్మ, మహానంది మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని, మహానంది టెంపుల్ చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ బండి ఆత్మకూరు మండల అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు నాయకుడు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల కొద్ది రోజులే

జూపాడుబంగ్లా: కృష్ణా నదికి వరద ప్రవాహం రాకపోతే పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదల ఇక కొద్ది రోజులు మాత్రమేనని నీటి పారుదల అధికారులు చెబుతున్నారు. ఆదివారం సాయంత్రానికి శ్రీశైలం డ్యాంలో 855.20 అడుగుల నీటిమట్టం ఉండగా పోతిరెడ్డిపాడు వద్ద 854.20 అడుగులగా నీటిమట్టం నమోదైంది. ప్రస్తుతం పోతిరెడ్డిపాడు 5గేట్ల ద్వారా 5,000 క్యూసెక్కుల నీటిని ఎస్సారెమ్సీ కాల్వలోకి సరఫరా చేస్తున్నారు. శ్రీశైలం డ్యాంలో 845 అడుగుల నీటిమట్టం వరకు పోతిరెడ్డిపాడు నుంచి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసుకొనే అవకాశం ఉంది. శ్రీశైలం డ్యాంలో రోజు రోజుకు నీటిమట్టం తగ్గుతుండటంతో వారం రోజుల్లోనే పోతిరెడ్డిపాడు నుంచి నీటి సరఫరా నిలిచిపోయే అవకాశం ఉంది.

హరికిషన్‌కు 'గిడుగు' పురస్కారం

కర్నూలు కల్చరల్: గిడుగు వేంకట రామమూర్తి సాహిత్య పురస్కారానికి జిల్లా రచయిత డాక్టర్ ఎం.హరికిషన్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఏపీ అధికార భాషా సంఘం , తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షులు పి.విజయబాబు సత్కార ఆహ్వానాన్ని పంపారు. తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వేంకట రామమూర్తి జయంతి సందర్భంగా సాహిత్య రంగంలో విశేష సేవలు అందిస్తున్న వారికి ఈ పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. తెలుగు భాషా వికాస వారోత్సవాల్లో భాగంగా విజయవాడలో 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు అతిథుల చేతుల మీదుగా హరికిషన్ సత్కారం అందుకోనున్నారు.

మల్లన్న సేవలో జడ్జీలు



మల్లన్న దర్శనార్థం వస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు



తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణ్‌కు వేదాశీర్వచనాలు అందజేస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్ కుటుంబ సమేతంగా ఆదివారం వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ లవన్న, అర్చకులు ఆలయ మ ర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు,లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

బంగారు హారం బహూకరణ



మణియార్‌కు హారం అందజేస్తున్న దాత

ఆళ్లగడ్డ/దొర్నిపాడు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలం శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో వెలసిన శ్రీ అమృతవల్లీ అమ్మవారికి ఆదివారం దాతలు బంగారు హారాన్ని బహూకరించారు. దొర్నిపాడు మండలం గుండుపాపల గ్రామానికి చెందిన గోపవరం బాల వెంకటరెడ్డి భక్తుడు 27.970 గ్రాముల బంగారు హారంతో పాటు 167.300 గ్రాముల వెండి పళ్లాన్ని మణియార్ సౌమ్యానారాయణ్‌కు అందజేశారు. అనంతరం దాతను సత్కరించి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

సీఎం చొరవతోనే వేతనాలు పెంపు

- సెర్ప్ సీఈఓ ఏఎండీ ఇంతియాజ్



సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ దంపతులను సత్కరిస్తున్న వైకేపీ-డీఆర్‌డీఏ ఉద్యోగులు

కర్నూలు(అగ్రికల్చర్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరువ తీసుకోవడం వల్లే వైకేపీ-డీఆర్‌డీఏ హెచ్‌ఆర్ పాలసీ ఉద్యోగులకు 23 శాతం వేతనాలు పెంచడం సాధ్యమైందని సెర్ప్ సీఈఓ ఏఎండీ ఇంతియాజ్ తెలిపారు. సీఈఓ దంపతులను ఆదివారం కర్నూలులో ఉమ్మడి కర్నూలు జిల్లా వైకేపీ-డీఆర్‌డీఏ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ... పేదరిక నిర్మూలన లక్ష్యంగా వైకేపీ ఉద్యోగులు చేస్తున్న కృషిని, సాధిస్తున్న ఫలితాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాహణబూోణఱ/. హెచ్‌ఆర్ ఉద్యోగులకు వేతనాలు పెంచాల్సిన విషయాన్ని సీఎం దృష్టికి తీసుకపోవడంతో సానుకూలంగా స్పందించారని, 23 శాతం వేతనాలు పెంచేందుకు అమోదం తెలిపారని పేర్కొన్నారు. మరింత బాధ్యతతో పనిచేయాలని సూచించారు. నంద్యాల ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి, కర్నూలు ఏపీడీ శ్రీధర్ రావు, డీపీఎంలు అబ్దుల్ రహిమాన్, నరసమ్మ, ఏపీఎంలు ప్రసాద్, శ్రీనివాసులు, పుల్లయ్య, కరుణాకర్, రాఘవేంద్ర, సీసీలు కృష్ణుడు, కృష్ణారెడ్డి, చెన్నయ్య, అడ్మిన్ అసిస్టెంటు ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం



మాట్లాడుతున్న ఏపీటీబీఈఎఫ్ ప్రధాన కార్యాదర్శి రాంబాబు

- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి రాంబాబు

కర్నూలు(అగ్రికల్చర్): బ్యాంకుల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు అన్ని బ్యాంకుల ఉద్యోగులు సమష్టిగా ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య (ఏపీటీబీఈఎఫ్) ప్రధాన కార్యదర్శి రాంబాబు అన్నారు. ఆదివారం కర్నూలులోని కెమిస్ట్రీ భవన్‌లో ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్(ఏఐబీఈఏ) ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ అధ్యక్షురాలు రోజారమణి అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ... బ్యాంకుల ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందని, దీనిని తిప్పి కొట్టాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. బ్యాంకుల విలీనంతో సిబ్బంది కొరత పెరిగిపోయిందని, పనిభారం కూడా పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని బ్యాంకుల్లోను ఉద్యోగుల నియామక ప్రక్రియ ఆగిపోయిందని, వెంటనే సిబ్బంది సంఖ్యను పెంచేందుకు కొత్త నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఏఐబీఈఏ సాధించిన విజయాలను ఏఐబీఈఏ ఉమ్మడి జిల్లా జనరల్ సెక్రటరీ నాగరాజు వివరించారు. ఈ సందర్భగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య డిప్యూటీ సెక్రటరీ ఉదయకుమార్, సెక్రటరీ వడియవర్లు పాల్గొన్నారు.

శ్రీశైలంలో 92 టీఎంసీలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 92.2670 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి వరద ప్రవాహం లేకపోవడం, దిగువ ప్రాంతాలకు నీటి విడుదల కొనసాగుతుండడం వలన జలాశయంలో నీటిమట్టం రోజురోజుకు తగ్గుతుంది. శనివారం నుంచి ఆదివారం వరకు ఎడమగట్టు భూగర్భజలవిద్యుత్ కేంద్రంలో 1.722 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం 3,294 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 6 వేల క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,688 క్యూసెక్కులు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకానికి 265 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఆదివారం సాయంత్రానికి జలాశయం నీటిమట్టం 855.20 అడుగులకు చేరుకుంది.

ఆకాశం ఎందుకో ఎర్రబడ్డది..

'ఓయ్.. సెక్రటరీ అటు కళ్లెట్టుకు చూడు.. సూర్యుడు నెత్తురు గడ్డలా లేడు.. మనిషి అన్నాక కాసింత కళాపోషణ ఉండాలయ్యా' అదేదో సినిమాలో రావు గోపాలరావు డైలాగ్ ఇది. ఆకాశంలో ఇటువంటి దృశ్యాలే చూసే సినీ కవి ఈ డైలాగ్ రాసి ఉండొచ్చేమో మరీ. ఆదివారం సాయంత్రం మహానంది సమీపంలో ఆకాశం ఇలా ఎర్రబడి కనిపించింది. – మహానంది

